సాక్షి
హనుమకొండ
మంగళవారం | 19 | ఆగస్టు | 2025



పాపన్నగౌడ్ జయంతి రసాభాస
హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సర్దార్ పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమం రసాభాసగా సాగింది. - 8లో▸



అర్జీలు త్వరగా పరిష్కరించండి
అర్జీలు సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.3^0 / 23.7^0
వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు కురుస్తాయి. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

కమిషనరేట్ క్రైమ్ డీసీపీగా గుణశేఖర్



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ డీసీపీగా గుణశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ డీసీపీగా పని చేస్తున్న గుణశేఖర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేసింది. ఈసందర్భంగా పోలీస్ అధికారులు నూతన డీసీపీని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందించారు.

కాకతీయ జూపార్కుకు ట్రెయినీ బీట్ ఆఫీసర్లు



న్యూశాయంపేట: ఫారెస్ట్ అకాడమీ, దూలపల్లిలో శిక్షణ పొందుతున్న 37వ బ్యాచ్‌కు చెందిన 40 మంది ట్రెయినీ బీట్ ఆఫీసర్లు ఒక రోజు శిక్షణలో భాగంగా సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జువలాజికల్ పార్క్‌కు వచ్చారు. వీరికి జూ పార్క్ ఇన్‌చార్జ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి మయూరి, ఇతర పార్క్ అధికారులు చిరుతల సంరక్షణ, తెల్లపులి సంరక్షణ, వాటి ఆహార నియమాలు తదితర అంశాలపై వివరించారు. అలాగే పార్క్‌లోని శాఖాహార జంతువులు, పక్షులు, ఇతర జంతువుల సంరక్షణ విధానం ఆహారం, పార్క్ సిబ్బంది విధుల గురించి తెలిపారు.

ఆధ్యాత్మికతలో జీవించాలి





హన్మకొండ కల్చరల్: ఆధ్యాత్మిక ప్రపంచంలో జీవిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని వారణాసి సంత్ రవిదాస్ ఆశ్రమం పీఠాధిపతి ఆచార్య భరత్‌భూషణ్‌దాస్ ఉద్బోధించారు. సోమవారం వెయ్యి స్తంభాల ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా వారిని ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈఓ అనిల్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించుకున్న అనంతరం భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈఓ అనిల్‌కుమార్ ఆచార్యులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను పండ్లను అందజేశారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా చివరి సోమవారం స్వామివారిని సర్పరుద్రుడిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠశర్మ అవధాని, అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి వలంటీర్ల ఎంపిక

కేయూ క్యాంపస్: గుజరాత్ పాటన్ జిల్లాలోని విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 31 నుంచి నిర్వహించనున్న ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు కేయూలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను ఎంపిక చేశారు. ఇందులో కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ కార్యాలయం సూపరింటెండెంట్ సంజయ్, కేయూ పరిధి ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్, అశోక్ మోరె, పిరాధిక, దత్తాత్రేయ, సతీశ్ చంద్ర, వలంటీర్లు పాల్గొన్నారు.

వానల కాలం.. ప్రాణాలు పదిలం

హనుమకొండ జిల్లాలో..	
విద్యుత్ వినియోగదారులు	: 4,86,266
ఇందులో గృహ విద్యుత్ వినియోగదారులు	: 3,61,540
వ్యవసాయ వినియోగదారులు	: 67,573
విద్యుత్ సబ్‌స్టేషన్లు	: 74
డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు	: 12,489

వరంగల్ జిల్లాలో..	
వినియోగదారులు	: 4,20,925
ఇందులో గృహ వినియోగదారులు	: 2,99,091
వ్యవసాయ వినియోగదారులు	: 70,853
విద్యుత్ సబ్‌స్టేషన్లు	: 76
డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు	: 12,467



విద్యుత్ వినియోగంలో అప్రమత్తత అవసరం
- ఆదమరిస్తే అంతే సంగతులు
- సొంతంగా మరమ్మతు చేయవద్దు..
- విస్తృత అవగాహన కల్పిస్తున్న అధికారులు

హన్మకొండ: వర్షాకాలంలో విద్యుత్ రూపంలో ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం ఆదమరిచినా.. ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలి. తడిదుస్తులు ఆరేస్తూ, మోటార్లు ఆన్ చేస్తూ, మరమ్మతుల సమయంలో విద్యుత్ తీగలు పట్టుకుని, తెగిన తీగల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తెగిన విద్యుత్ లైన్లు, టాన్స్‌ఫార్మర్ గద్దెలు ఎత్తు తక్కువగా ఉండడంతో పశువులు విద్యుదాఘాతానికి గురై చనిపోతున్నాయి. ఈక్రమంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సిబ్బంది భద్రతా చర్యలు పాటించకపోవడంతో పాటు ఎల్‌సీల్లో నిబంధనలు పాటించకపోవడం, నిర్లక్ష్యం కారణంగా విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

క్షేత్రస్థాయిలో అవగాహన..
జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా సర్కిల్‌లోని డీఈ టెక్నికల్ ఆధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించి విద్యుత్ ప్రమాదాల నివారణకు టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం కృషి చేస్తోంది. పొలం బాట ద్వారా రైతులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులు, వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లో సంస్థ చేయాల్సిన విద్యుత్ పనులు సొంతగా చేయొద్దని అధికారులు చెబుతున్నారు. భద్రతపై ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, సిబ్బందికి అన్ని రకాల భద్రత పరికరాలు హెల్మెట్, గ్లౌవ్స్, పోర్టబుల్ ఎర్తింగ్, షార్ట్ సర్క్యూట్ కిట్లు, సేఫ్టీ షూస్, ఇన్సులేటెడ్ టూల్స్, ఓల్టేజ్ డిటెక్టర్ వంటివి అందించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..
- తడిసిన విద్యుత్ స్తంభాల స్టే వైర్, సపోర్ట్ వైరును, ట్రాన్స్‌ఫార్మర్, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకవద్దు.
- దండెం వైర్లను, విద్యుత్ వైర్లను కలుపవద్దు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ జీఐ వైర్లను ఉపయోగించాలి.
- వోల్టేజీలో హెచ్చుతగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా విద్యుత్ శాఖ వారికి తెలియజేయాలి.
- వర్షాల కారణంగా చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తాకి షాక్ కొట్టే ప్రమాదం ఉంది.
- వ్యవసాయ నిమిత్తం, గృహాల్లో అతుకులు లేని సర్వీస్ వైరును మాత్రమే ఉపయోగించాలి.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకవద్దు, వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.
- ఎవరికైనా పొరపాటున కరెంట్ షాక్ కొడితే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలన్న అత్రుతతో ప్రమాదం బారిన పడిన వ్యక్తిని ముట్టుకోవద్దు.

అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ సమస్యలు వస్తే ఏఈ, సిబ్బందికి తెలియజేయాలి. ప్రతీ నెల జారీ చేసే బిల్ కమ్ నోటీస్‌పై ఏఈ, లైన్‌మెన్ ఫోన్ నంబర్ ఉంటుంది. వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేసుకోకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి వారిచే సమస్యను పరిష్కరించుకోవాలి. నిపుణులైన ఎలక్ట్రీషియన్‌తో విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి.
- పి.మధుసూదన్‌రావు, ఎస్‌ఈ, హనుమకొండ సర్కిల్

- రైతులు పంపు సెట్లను వాడుతున్నప్పుడు కరెంట్ మోటార్లకు కానీ, పైపులను కానీ, ఫుట్ వాల్వులను ఏమర పాటుతో తాకకూడదు. వ్యవసాయ పంపు సెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి. విద్యుత్ ప్రమాదాలు ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయి. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జీఐ పైపులు, ఫుట్ వాల్వ్‌లు తాకడం అత్యంత ప్రమాదకరం.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేర్ చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- మోటారు పంపుసెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సొంతగా సరిచేద్దామని ప్రయత్నిస్తే ప్రాణనష్టం, హాని జరగవచ్చు. మోటారు రిపేర్ తెలిసిన వారిచేతనే చేయించాలి.
- గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బందికి లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్లను సంప్రదించి వారి సేవలను పొందాలి.
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ పరికరాలు అందుబాటులో వచ్చిన ప్రస్తుత తరుణంలో వాటిని వినియోగించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చు.
- విద్యుత్ పరికరాలు, వైరింగ్, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గుర్తింపు కలిగినవి వాడాలి.

రైతులందరికీ యూరియా అందాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులు

హన్మకొండ: వానాకాలం పంటల సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావుతో కలిసి యూరియా, ఎరువుల లభ్యతపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హనుమకొండ నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

వేగంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రామన్నపేట: ప్రజావాణి ఫిర్యాదుల్ని వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి ఆమె 81 దరఖాస్తులు స్వీకరించారు. సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఇంజనీరింగ్ నుంచి 15, హెల్త్ అండ్ శానిటేషన్ నుంచి 8, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) నుంచి 13, టౌన్‌ప్లానింగ్‌లో 41, హార్టికల్చర్‌కు 2, నీటి సరఫరా కోసం 2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ సిటీప్లానర్లు మహేందర్, రవీందర్, రాడేకర్, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్‌రావు, హెచ్‌ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మోస్తరు వర్షం



హన్మకొండ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండం కారణంగా నాలుగు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. సోమవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. హనుమకొండ, వరంగల్ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. సోమవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లో నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడిపల్లిలో 25.8 మిల్లీ మీటర్లు, దుగ్గొండిలో 23.5, ఖానాపూర్ మండలం మంగలవారిపేటలో 23.5, నల్లబెల్లిలో 23.3, చెన్నారావుపేటలో 22, వరంగల్ పైడిపల్లిలో 18.5, గీసుకొండలో 15.8, గీసుకొండ మండలం గొర్రెకుంటలో 15.5, నర్సంపేట మండలం లక్నేపల్లిలో 15.3, వరంగల్ ఉర్సులో 13.3, నెక్కొండలో 13, కాశిబుగ్గలో 12.5, రాయపర్తిలో 3.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లా దామెరలో 19.8, పరకాలలో 19.8, ఆత్మకూరులో 17.3, దామెర మండలం పులుకుర్తిలో 17, శాయంపేటలో 16.8, నడికూడలో 15.8, కాజీపేటలో 15.5, కమలాపూర్‌లో 13.3, ధర్మసాగర్‌లో 12, ఐనవోలులో 12, మడికొండలో 10.3, ఐనవోలు మండలం కొండపర్తిలో 10.3, హసన్‌పర్తి మండలం నాగారంలో 10, ఎల్కతుర్తిలో 10, భీమదేవరపల్లిలో 9, వేలేరులో 8.8, ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాలలో 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: పాత, కొత్త తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా సమన్వయంతో కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకునేందుకు పాటుపడాలని కోరారు. సోమవారం పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రేవూరి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. గత ప్రభుత్వాల వైఫల్యాలు, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాలని కోరారు. త్వరలో పార్టీలోకి భారీగా చేరికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పరకాల, ఆత్మకూరు, దామెర, నడికూడ మండలాల సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌తో శాస్త్రీయ దృక్పథం

- నేటినుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- టాస్ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్న టాస్ అధ్యక్షుడు సీహెచ్.మోహన్‌రావు, చిత్రంలో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, వి.రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్: విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యంగా టాస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా యూనివర్సిటీలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్), హైదరాబాద్ సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్. మోహన్‌రావు తెలిపారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాభివృద్ధి అనేది సైన్స్ అండ్ టెక్నాలజీపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా సైన్స్ ముఖ్యమన్నారు. ఆ దిశగా విద్యార్థుల్లో సైన్స్‌ను ప్రమోట్ చేసేందుకు, జిజ్ఞాస పెంచేందుకు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో సైంటిస్టులు, విద్యావేత్తలు నూతన ఆవిష్కరణలపై శాస్త్రీయ సవాళ్లు, పురోగతులపై చర్చించనున్నారన్నారు. కేయూ స్వర్ణోత్సవంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో యూనివర్సిటీలో అకాడమిక్‌పరంగా పర్‌స్పెక్టివ్ మారాలన్నారు. ఇన్నోవేషన్స్, ఇంక్యుబేషన్, స్టార్టప్స్ ఎంట్రప్రెన్యూర్స్ రావాలన్నారు. కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవాల్లో భాగంగానే తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి 750 అబ్‌స్ట్రాక్ట్స్ వచ్చాయని, 700 మంది ప్రతినిధులు రానున్నట్లు తెలిపారు. కేయూ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 9గంటలకు సైన్స్‌కాంగ్రెస్ ప్రారంభ సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో టాస్ జనరల్ సెక్రటరీ, ఓయూ మాజీ వీసీ ఎస్.సత్యనారాయణ, కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం, టాస్ ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్‌ఎం రెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణోత్సవంలోకి కేయూ..
- యూనివర్సిటీ ఆవిర్భవించి 49 ఏళ్లు పూర్తి - 8లో▸
- నేడు 50వ వసంతంలోకి..

పరకాల పోలీస్‌స్టేషన్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం

- దాడి ఘటనలో ఫిర్యాదుతో మనస్తాపం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వామిరాజ్

పరకాల: హనుమకొండ జిల్లా పరకాల పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. నడికూడ మండలానికి చెందిన యువకుడు తాళ్ల స్వామిరాజ్ తోపాటు మరో ముగ్గురు తనపై హత్యాయత్నం చేశారంటూ అదే గ్రామానికి చెందిన కిన్నెర మల్లికార్జున్ అనే వ్యక్తి పరకాల పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై పరకాల పోలీసులు స్వామిరాజ్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. తనపై కావాలనే కుట్ర పూరితమైన కేసు పెట్టారనే మనస్తాపంతో స్వామిరాజ్ తన వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందును స్టేషన్‌లోనే తాగాడు. పోలీసులు, ఆయన వెంట వచ్చిన వ్యక్తులు వెంటనే చికిత్స నిమిత్తం పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ.. కిన్నెర మల్లికార్జున్ ఇంట్లో తాళ్ల అనిల్‌కుమార్ అద్దెకు ఉంటున్నాడని తెలిపారు. అనిల్‌కుమార్‌కు, అదే గ్రామానికి చెందిన స్వామిరాజ్‌కు పాత తగాదాలు ఉండడంతో పొలం పనికి వెళ్లివస్తున్న మల్లికార్జున్‌ను స్వామిరాజ్ అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా దాడి చేసినట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. స్వామిరాజ్‌ను స్టేషన్‌కు పిలిపించామని, తాము ఎలాంటి ఇబ్బందీ పెట్టలేదని స్పష్టం చేశారు.

రైతులకు యూరియా తిప్పలు

- ఓ వైపు రైతుల బారులు.. మరో వైపు క్యూలైన్‌లో చెప్పులు
- ఈ-పాస్ పనిచేయక నగంలోనే నిలిచిన పంపిణీ



కమలాపూర్‌లో ఓ వైపు బారులుదీరిన రైతులు.. మరోవైపు క్యూలైన్‌లో పెట్టిన చెప్పులు

కమలాపూర్: రైతులను యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. పనులన్నీ వదులుకుని కుటుంబ సమేతంగా వచ్చి గంటల తరబడి క్యూలైన్‌లో నిలుచున్నా యూరియా దొరకడం గగనంగా మారింది. ప్రస్తుతం వరి నాట్లు పూర్తయి యూరియా అత్యవసరమైంది. కమలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సోమవారం 888 బస్తాల యూరియా రాగా, సమాచారం అందుకున్న రైతులు వేకువ జామునుంచే పీఏసీఎస్ గోదాం వద్దకు చేరుకున్నారు. సుమారు 1,500 మందికి పైగా రైతులు వర్షంలోనే బారులుదీరగా.. మరి కొందరు క్యూలైన్‌లో చెప్పులు పెట్టారు. గత ఐదారు రోజులుగా యూరియా పంపిణీ చేయకపోవడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో వచ్చిన స్టాక్‌లో సగానికిపైగా పోలీసు పహారాలో పంపిణీ చేశారు. తర్వాత ఈ-పాస్ సర్వర్ మొరాయించడంతో సుమారు 300 బస్తాల యూరియా పంపిణీ నిలిచిపోయింది. అందుబాటులో ఉన్న యూరియా వరకు రైతులకు టోకెన్లు జారీ చేసి మంగళవారం పంపిణీ చేస్తామని చెప్పి పంపించారు. యూరియా, టోకెన్లు దొరకని పలువురు రైతులు నిరాశగా వెనుదిరిగి వెళ్లిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక యూరియా కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, ఎండనకా, వాననక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, ప్రభుత్వం స్పందించి సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత.. రోడ్డెక్కిన రైతులు



ఎల్కతుర్తిలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఎల్కతుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం యూరియాను సకాలంలో అందించడం లేదని మండల రైతులు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకోకు దిగారు. రైతులకు సరిపడా యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తే, అవి ఏ మూలకూ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించాలని డిమాండ్ చేశారు. పోలీసులు కలగజేసుకుని యూరియా అందించేలా అధికారులతో మాట్లాడించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పాల అమ్మకాలు ఎందుకు తగ్గుతున్నాయి?

వరంగల్ పాలు.. ఖమ్మంలో ఎలా అమ్మారు?
- విజయ డెయిరీలో ప్రత్యేక కమిటీ విచారణ
- పాల డబ్బులు పెండింగ్‌లో ఉండడంపై ఆరా



వరంగల్ నగరంలోని విజయ డెయిరీ

హన్మకొండ చౌరస్తా: నగరంలోని ములుగురోడ్ సమీపంలో గల ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ యూనిట్‌ను సోమవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక అధికారుల బృందం తనిఖీ చేసింది. ఈ డెయిరీ అధికారుల తీరుపై ఇటీవల వస్తున్న విమర్శలు, ఆరోపణల నేపథ్యంలో విచారణ కోసం ఎండీ ప్రత్యేక కమిటీని నియమించినట్లు తెలిసింది. ఆయన ఆదేశాలతో నగరానికి చేరుకున్న ప్రత్యేక కమిటీ ఏడాదికాలంగా జరిగిన పాల అమ్మకాలు, సేకరణ, రికార్డులను పరిశీలించారు. ఉదయం 11 గంటలకు డెయిరీకి చేరుకున్న అధికారులు సాయంత్రం 4గంటల వరకు విచారణ చేపట్టారు.

తగ్గిన అమ్మకాలు
విజయ డెయిరీ వరంగల్ పరిధిలో సివిల్ మార్కెట్‌లో పాల అమ్మకాలు గతేడాది సుమారు ఆరు వేల లీటర్లు ఉండగా, ఈ ఏడాది సగానికి పైగా పడిపోయినట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైనట్లు తెలిసింది. అంతేకాకుండా పాడిరైతులకు, డెయిరీ అధికారులకు దూరం పెరగడంతో సేకరణ సైతం గణనీయంగా పడిపోయింది. దీనిపై విచారణ అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పెండింగ్‌లో లక్షల రూపాయలు
పాల అమ్మకాల డబ్బులు లక్షల్లో పెండింగ్‌లో ఉండడంపై అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పాల అమ్మకాల కోసం గత ఏడాది ఓ డిస్ట్రిబ్యూటర్‌ను నియమిస్తే సదరు వ్యక్తి మధ్యలోనే చేతులెత్తేశాడు. డిస్ట్రిబ్యూటర్ ద్వారా డెయిరీకి చెల్లించాల్సిన సుమారు రూ.30 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం కొత్తగా మరో డిస్ట్రిబ్యూటర్‌కు అమ్మకాల బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది.

సిబ్బందితో సమావేశం
హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక కమిటీ సభ్యులు.. వరంగల్ డెయిరీ సిబ్బందితో రెండు గంటలపాటు సమావేశమయ్యారు. పాల అమ్మకాలను పెంచుకోవడంతోపాటు పాడిరైతులకు మరింత చేరువై సేకరణను ఎలా పెంచుకోవాలి అనే అంశాలపై సిబ్బంది నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. సమష్టిగా పనిచేసి డెయిరీ ప్రతిష్ఠను పెంచుకుందామని సిబ్బందికి సూచించారు. విచారణ కమిటీలో విజయ డెయిరీ వరంగల్ ప్రత్యేక అధికారి, జనరల్ మేనేజర్లు మల్లయ్య, కవిత, ప్రొక్యూర్‌మెంట్ అధికారి మధుసూదన్‌రావు, ఆర్‌ఎస్‌ఎం ధన్‌రాజ్ ఉన్నారు.

ఖమ్మంలో వరంగల్ పాలు
వరంగల్ యూనిట్ పాల ప్యాకెట్లు గత నెలలో ఖమ్మంలో అమ్ముతుండగా అక్కడి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపైనా వరంగల్ అధికారులను ఉన్నతాధికారులు ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పకుండా దాటవేసినట్లు డెయిరీ వర్గాలు చెబుతున్నాయి.

బాలికపై లైంగికదాడికి పాల్పడిన నేరస్తుడికి ఇరవై ఏళ్ల జైలు



వరంగల్ లీగల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నేరస్తుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 15 వేల జరిమానా విధిస్తూ ఒకటో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అపర్ణాదేవి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండలం బయ్యారం చిన్న తండాకు చెందిన ఓ మహిళ బతుకుదెరువు నిమిత్తం కాజీపేట డీజిల్ కాలనీ ప్రాంతానికి వచ్చి ఇక్కడే మొక్క జొన్న కంకులు కాల్చి విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈమెకు నలుగురు కూతుళ్లు ఉండగా ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కూతురు ఏడో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. అప్పుడప్పుడు తల్లి వద్దకు వచ్చి పనులు చేస్తూ చేదోవాదోడుగా ఉండేది. ఈక్రమంలో పర్వతగిరి మండలం అన్నారం తండా చెందిన వాంకుడోత్ చంద్రుడు.. ఆ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. 2022, డిసెంబర్ 15న రాత్రి ఫోన్ చేసి బాలికకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం సదరు బాలికను రోడ్డుపై వదిలేసి వెళ్లాడు. ఈవిషయమై ఎవరికైనా చెబితే నీవు నాతో తీసుకున్న ఫొటోలు అందరికీ చూపిస్తానని భయపెట్టాడు. ఈ ఘటనపై బాలిక తల్లి కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ మహేందర్ రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ ఏరుకొండ సుధాకర్, కోర్టు లైజన్ ఆఫీసర్, ఏఎస్సై పరమేశ్వరి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి అపర్ణాదేవి.. నేరస్తుడు వాంకుడోత్ చంద్రుడుకు 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- కొత్తగట్టు సింగారం స్టేజీ వద్ద ఘటన



ఘటనాస్థలిలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : ఆగి ఉన్న లారీని ఓ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండలంలోని కొత్తగట్టు సింగారం స్టేజీ వద్ద చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్, పోలీసుల కథనం ప్రకారం.. టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన ఎం.డి గౌసోద్దీన్ భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం శివారులో ఓ లారీని రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా నిలిపి ఉంచారు. ఇదే సమయంలో హనుమకొండ నుంచి కాళేశ్వరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి లారీని ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతినడంతోపాటు ప్రయాణికులు రాజయ్య, సరోజన, వెంకటమ్మ, సౌజన్య, చంద్రయ్య, శివరుణ్, ఎల్లమ్మ, పవిత్ర, ఉమారాణి, పోషక్క, అమూల్యకు స్వల్ప గాయాలు కావడంతో 108లో ఎంజీఎం తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై జక్కుల పరమేశ్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. అనంతరం బస్సు డ్రైవర్ గౌసోద్దీన్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ అబ్దుల్ ఖాయమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనలో ప్రయాణికులకు స్వల్ప గాయాలై పెనుప్రమాదం నుంచి తప్పించుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి రూ.12 970 నగదు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. వరంగల్ ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న బొందుగుల అఖిల్, జడల సాగర్, నమిండ్ల కర్ణాకర్, ఇమ్మడి హర్షపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం ఏనుమాముల పోలీస్ స్టేషన్‌కు కేసును అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు వివరించారు.

స్వర్ణోత్సవంలోకి కేయూ..

యూనివర్సిటీ ఆవిర్భవించి 49 వసంతాలు పూర్తి

నేడు 50వ వసంతంలోకి..

- న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించినా సమస్యలే
- వేధిస్తున్న రెగ్యులర్ అధ్యాపకుల కొరత
- బోధన, పరిశోధనలపై తీవ్ర ప్రభావం
- పీజీ సెంటర్లను పట్టించుకునే నాథుడు కరువు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ.. నిత్య చైతన్య దీప్తిగా ఉంటూ ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన చదువులమ్మ ఒడి. అంతేకాకుండా ఉద్యమాల గడ్డ.. పోరాటాల అడ్డాగా పేరొందింది. ఈ క్రమంలో యూనివర్సిటీ మంగళవారం 50వ వసంతంలోకి అడుగిడబోతోంది. రాష్ట్రంలో ఉస్మానియా తర్వాత ప్రతిష్టాత్మక యూనివర్సిటీగా కేయూ గుర్తింపు పొందింది. న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించి విద్యార్థుల ప్రాధాన్య యూనివర్సిటీగా మారింది. ఈ నేపథ్యంలో ఈనెల 19వ తేదీతో 49 సంవత్సరాలు పూర్తిచేసుకుని స్వర్ణోత్సవంలోకి అడుగుపెట్టబోతోంది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రస్థానం, ఇక్కడ నెలకొన్న సమస్యలు, కావాల్సిన సదుపాయాలపై 'సాక్షి' ప్రత్యేకథనం.

తొలుత ఓయూ పీజీ సెంటర్‌గా..

తొలుత ఉస్మానియా యూనివర్సిటీ పీజీ సెంటర్‌గా 1968లో ప్రారంభమైంది. 1976 ఆగస్టు 19న కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భవించింది. ఈ 49 ఏళ్లలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దింది. ఎంతో మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. అయితే ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన కేయూ.. నేడు అనేక సమస్యలతో సతమవుతోంది. పాఠాలు బోధించేందుకు వివిధ విభాగాల్లో రెగ్యులర్ ప్రొఫెసర్ల కొరత ఉంది. ఒకప్పుడు కేయూలో సీనియర్ ప్రొఫెసర్లతో విద్యతోపాటు పరిశోధనలు విస్తృతంగా జరిగేవి. ఇది అంతా గతం. తెలంగాణ ఆవిర్భావంతో యూనివర్సిటీ అభివృద్ధిలో పయనిస్తుందని భావించారు. కానీ సమస్యలు పరిష్కారం కాకపోగా గత ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విద్యావేత్తలు ఆరోపిస్తున్న విషయం విదితమే. కేయూ నిధుల లేమితో ఇంకా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

నాలుగు విభాగాలతో మొదలై.. 28 విభాగాల వరకు..

కాకతీయ యూనివర్సిటీ తొలుత నాలుగు విభాగాలతో మొదలై అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం 28 విభాగాలతో కొనసాగుతోంది. మూడు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని 11 జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు 211 ఉండగా, యూనివర్సిటీ పీజీ కళాశాలలు 74, ఇంజనీరింగ్ 6, ఫార్మసీ 25, ఎడ్యుకేషన్ 41, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, 'లా' కళాశాలలు 3, ఎంబీఏ 24, ఎంసీఏ 7, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలు 3 ఉన్నాయి. ఇటీవల కేయూ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ యూనివర్సిటీగా ఏర్పాటు చేసిన విషయం విదితమే.



కేయూ పరిపాలన భవనం

బోధన అంతంత మాత్రమే..

కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు బోధన అంతంతమాత్రంగానే ఉంటుంది. రెగ్యులర్ అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లు కలిపి 77 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో కొందరికి రెండు, మూడు, నాలుగైదు పరిపాలన పదవులు కూడా ఉండడంతో వారు బోధనపై అంతగా దృష్టిసారించడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని విభాగాల్లో ఒక్క రెగ్యులర్ అధ్యాపకుడు కూడా లేరు. ఉదాహరణకు తెలుగు, పొలిటికల్ సైన్స్, విద్యా, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలు, సైకాలజీ, జర్నలిజం విభాగాలున్నాయి. ఎకనామిక్స్, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బాటనీలో విభాగాల్లో ఒక్కొక్కరే రెగ్యులర్ ప్రొఫెసర్ ఉన్నారు.

కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్లతోనే బోధన..

కేయూలో 176 మంది వరకు కాంట్రాక్టు లెక్చరర్లు, 183 మంది వరకు పార్ట్‌టైం లెక్చరర్లు ఉన్నారు. అయినా వివిధ విభాగాలు, యూనివర్సిటీ కాలేజీలో వర్క్‌లోడ్‌కు అనుగుణంగా ఇటీవలే పేపర్‌వైజ్‌గా విద్యాబోధనకు తాత్కాలిక పద్ధతిలో కొందరిని నియమించారు.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

కేయూలో ప్రధానంగా రెగ్యులర్ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. అన్ని విభాగాలు కలిపి (అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్) 409 పోస్టుల మంజూరు ఉండగా ప్రస్తుతం 77మంది అధ్యాపకులే ఉన్నారు.

పీజీ సెంటర్లను పట్టించుకునే వారేరి?

కేయూ పరిధిలోని పీజీ సెంటర్లను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. 2012–2013లో ఏర్పాటు చేసిన మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాలోని పీజీసెంటర్లలో ఒక్క రెగ్యులర్ లెక్చరర్ లేరు. ప్రిన్సిపాల్ కూడా లేరు. పేరుకు యూనివర్సిటీలోని వైస్ ప్రిన్సిపాల్‌కే ఇన్‌చార్జ్ అని ఇస్తున్నారు. కానీ వారు కూడా వెళ్లడం లేదు. బోధించేవారు అంతంత మాత్రమే. దీంతో అడ్మిషన్ల సంఖ్యతగ్గిపోతోంది. నిర్మల్ పీజీ సెంటర్ ఇప్పటికే మూతపడిందని భావిస్తున్నారు. ఖమ్మం పీజీ సెంటర్‌లో కూడా రెగ్యులర్ అధ్యాపకుల కొరత ఉంది.

నాన్ టీచింగ్ ఉద్యోగుల పోస్టులు కూడా వెకెన్సీలు

గెజిటెడ్ ఆఫీసర్స్ ఉద్యోగుల పోస్టులు 29కి 22మంది పనిచేస్తున్నారు. ఎన్‌జీఓ కేడర్ ఉద్యోగుల పోస్టుల మంజూరు 240 ఉండగా 115 వెకెన్సీలుగా ఉన్నాయి. క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ పోస్టులు మంజూరు 225 ఉండగా 78 మంది పనిచేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 507మంది పనిచేస్తున్నారు. కాగా, ఉద్యోగులకు ఫేస్‌రికగ్నిషన్ హాజరు వచ్చే నెలలో అమలు చేయాలని వీసీ ప్రతాప్‌రెడ్డి నిర్ణయించారు.

ఫీజుల భారం..

మూడేళ్లక్రితం కేయూలోని పీజీ, ప్రొఫెషనల్ ఎస్ఎఫ్‌సీల్లో అదనపు సీట్లు పెంచడంతోపాటు ఫీజులు కూడా భారీగా పెంచారు. అయితే ప్రభుత్వ నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కింద వర్సిటీకి రూ. 50కోట్లకు పైగానే బకాయిలు రావాల్సి ఉందని సమాచారం.

విద్యార్థుల ప్రధాన సమస్యలు..

కేయూలో ఎస్ఎఫ్‌సీలను రెగ్యులర్‌గా మార్చాలని విద్యార్థులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. అలాగే, విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. హాస్టళ్ల భవనాలు సరిపడాలేకపోవడంతో విద్యార్థులు బయట ప్రైవేట్‌గా ఉంటుండడంతో ఆర్థిక భారం పడుతుంది. క్యాంపస్‌లోని రెండు ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ రెగ్యులర్ అధ్యాపకుల నియమించాల్సింది. ఇంజనీరింగ్ విద్యార్థినులకు హాస్టల్ వసతి అవసరం ఉంది.

మౌలిక వసతులకు రూ. 300 కోట్లకు ప్రతిపాదనలు..



కాకతీయ యూనివర్సిటీ 50 వసంతంలోకి అడుగిడబోతుంది. దీంతో వచ్చే ఆగస్టు వరకు గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నాం. యూనివర్సిటీలో అకడమిక్, నాణ్యమైన పరిశోధనల పరంగా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అడుగులు వేయబోతున్నాం. ఇందులో భాగంగా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 300 కోట్లతో ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం.

– కె.ప్రతాప్‌రెడ్డి, వీసీ, కేయూ

గణేశ్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ క్రైం: గణేశ్ నవరాత్రోత్సవాల్లో నిబంధనలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పిలుపునిచ్చారు. పోలీసు అధికారులు సూచించిన నిబంధనలు పాటించి వినాయక చవితిని ఘనంగా జరుపుకోవాలన్నారు. ట్రై సిటీ పరిధిలో ఏర్పాటు చేసే గణేశ్ మండపాల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలపై పోలీస్ కమిషనర్ పలు సూచనలిచ్చారు. గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీస్ ప్రొటోకాల్ వెబ్ సైట్ https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.

నింబధనలు ఇవీ..

- గణేశ్ మండపాలను ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో, స్థల యజమానితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.
- విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలి.
- మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలి.
- వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్ద కాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను ఏర్పాటు చేయరాదు.
- గణేశ్ ప్రతిమలు ఏర్పాటు చేసే ప్రదేశంలో షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత ఉన్న షెడ్ ఏర్పాటు చేసుకోవాలి. గణేశ్ మండపంలో 24 గంటలు ఒక వలంటీర్ ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి.
- మంటలు ఆర్పేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండపానికి సమీపంలో రెండు బకెట్ల నీళ్లు, ఇసుక ఏర్పాటు చేసుకోవాలి.
- మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాడడం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అసభ్యకర నృత్యాల ప్రదర్శన, అన్యమతస్తులను కించపరిచేలా ప్రసంగాలు చేయడం, పాటలు పాడడం పూర్తిగా నిషేధం.
- విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి. పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకం చేస్తారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే తక్షణమే డయల్ 100 కానీ లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ నిర్వాహకులకు సూచించారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణిలో వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 92 దరఖాస్తులు వచ్చాయి. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఆరెంజ్ అలెర్ట్ నేపథ్యంలో..

వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, రోడ్లు, రవాణా, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు శాఖల వారీగా అంతర్గత సమావేశాలు నిర్వహించుకుని పరిస్థితులకనుగుణంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు.

కొత్త కలెక్టరేట్‌లో గదిని కేటాయించండి



వరంగల్ ఆజాంజాహి మిల్లులో నిర్మితమవుతున్న నూతన కలెక్టరేట్‌లో పెన్షనర్స్‌కు సేవలు అందించడానికి ఒక గదిని కేటాయించాలి. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు హనుమకొండలో మాదిరి మాకు కూడా గదిని కేటాయిస్తే పదవి విరమణ ఉద్యోగులకు ఉచిత సేవలను అందించేందుకు తోడ్పాటు అందిస్తాం.

– పెన్షనర్స్ అసోషియేషన్, వరంగల్

పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలి

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ సత్యశారద పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా సర్దార్ పాపన్న చిత్రపటానికి కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు విజయలక్ష్మి, రాంరెడ్డి, పుష్పలత, 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, గౌడ సంఘం నాయకులు రమేశ్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, రాందాస్, యాదగిరి, రాజు, రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

పాపన్న గౌడ్ జయంతి రసాభాస



కలెక్టర్ రాకపోవడంపై అధికారులను ప్రశ్నిస్తున్న నాయకులు

- హనుమకొండ కలెక్టర్ రాకపోవడంపై బీసీల అసహనం

హన్మకొండ: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమం రసాభాసగా సాగింది. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారికంగా పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించింది. కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొనకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. బీసీ సంఘం నాయకులు బొనగాని యాదగిరి గౌడ్, సుందర్ రాజ్ యాదవ్, ఇతర బీసీ నాయకులు మాట్లాడుతూ కలెక్టర్.. బీసీల పట్ల చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్ రావాల్సిందేనని అక్కడున్న అధికారులతో గొడవకు దిగారు. ఈ క్రమంలో జయంతి వేడుకలు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకేనని, కార్యక్రమం ముగిసిందని, ప్రజావాణి నిర్వహించాల్సి ఉందని అధికారులు తెలపగా, తాము కలెక్టరేట్ ముందు రోడ్డుపై జయంతి జరుపుకుంటామని, ఈ ఫొటోలు, సమాచారం సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపుతామని హెచ్చరించారు. గొడవ పెద్దదవుతుందని తెలియడంతో కలెక్టర్ స్నేహ శబరీష్ కాన్ఫరెన్స్ హాల్‌కు చేరుకుని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీంతో బీసీ సంఘాల నాయకులు శాంతించారు. సోమవారం గ్రీవెన్స్ ఉన్నందున ప్రజలకు ఇబ్బంది కలగరాదని ఉద్దేశంతో ఆలోగా కార్యక్రమం పూర్తి చేయాలని చెప్పామని, ఏదైనా విషయం ఉంటే రాతపూర్వకంగా ఇవ్వండని బీసీ సంఘాల నాయకులకు కలెక్టర్ సూచించినట్లు సమాచారం. అనంతరం బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేశ్, డీఆర్‌డీఓ మేన శ్రీను, ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, డాక్టర్ కె.నారాయణ, జిల్లా బీసీ సంక్షేమాధికారి లక్ష్మణ్, బీసీ సంఘాల నాయకులు చిర్ర రాజు, శ్యామ్ యాదవ్, జనగామ శ్రీనివాస్ గౌడ్, మార్క విజయ్ గౌడ్, రామస్వామి గౌడ్, బూర విద్యాసాగర్, మౌనిక, తది తరులు పాల్గొన్నారు.



పాపన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ స్నేహశబరీష్, బీసీ సంఘాల నాయకులు

వినతులు త్వరగా పరిష్కరించండి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- ప్రజావాణిలో 185 అర్జీల స్వీకరణ

హన్మకొండ: ప్రజావాణికి వచ్చిన అర్జీలను అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 185 మంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేశ్, డీఆర్డీఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, డాక్టర్ నారాయణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

కుమారులు సాకట్లేదు..



నాకున్న వ్యవసాయ భూమిని కుమారుల పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేస్తే అందులో కొంత భూమిని అమ్ముకున్నారు. ఆస్తి దక్కగానే మమ్మల్ని సాకకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇంట్లోంచి వెళ్లిపోవాలని చిత్ర హింసలు పెడుతున్నారు. ఇప్పటికే కలెక్టర్‌కు చాలా సార్లు వినతి పత్రం ఇచ్చాం. ఆర్డీఓను ఎన్ని సార్లు కలిసినా పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా మేం కుమారులపైన చేసిన గిఫ్ట్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి మా పేరుపై భూమి పట్టా చేయాలి.

– చందరాజు నారాయణ, శాంతమ్మ, రాంపూర్

కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపాలి..



నా పెన్షన్ దరఖాస్తును కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపాలి. వివరాలన్నీ ఆర్డీఓ కార్యాలయంలో సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు తన దరఖాస్తును పంపించకపోగా, వివరాలు లేవని అధికారులు చెబుతున్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి లేఖ వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. అధికారుల్లో చలనం లేదు. నా ఫైల్ మాయం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడి ఫైల్ మాయం చేయడంతో పాటు ఏళ్లుగా తిప్పుకోవడం సరికాదు.

– బిల్లా ప్రతాప్‌రెడ్డి, స్వాతంత్ర సమరయోధుడు, చింతగట్టు

తరగతులకు రానివ్వట్లేదు..



ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించట్లేదు. మీరు చెల్లిస్తేనే తరగతులు నిర్వహిస్తామని కేర్ కాలేజీ ఆఫ్ ఫా ర్మసీ యాజమాన్యం చెబు తోంది. నాలుగేళ్లుగా తమకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వట్లేదు. దీంతో కళాశాల యాజమాన్యం తరగతులు నిర్వహించకుండా తమ విద్యా సంవత్సరాన్ని వృథా చేస్తోంది. 5వ సంవత్సరంలో ప్రాజెక్టు వర్క్ ఉంటుంది. ఈ కీలక సమయంలో తరగతులు నిర్వహించకుండా, ప్రాజెక్ట్ వర్క్‌కు పంపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. మొత్తం 17 మంది విద్యార్థులుండగా... ఇద్దరు విద్యార్థులు యాజమాన్యం కోటా కింద ప్రవేశం పొందారు. వీరికి తరగతులు నిర్వహిస్తున్నారు. మాకు నిర్వహించట్లేదు.

– కేర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు

వైద్యులు చర్యలు తీసుకోవాలి



వైద్యులు జనరిక్ ఔషధాలు సూచించేలా జిల్లా స్థాయి కమిటీ ద్వారా చర్యలు తీసుకోవాలి. జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించాలి. ఎంసీఐ నిబంధనల మేరకు రిజిస్టర్డ్ వైద్యులు బోల్డ్ క్యాపిటల్ లెటర్స్‌లో మందులు సూచించాలి. కానీ చాలా మంది వైద్యులు బ్రాండ్ పేరుతోనే మందులు రాస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి. జనరిక్ ఔషధాల ప్రయోజనాలు, లభ్యతపై అవగాహన కల్పించాలి.

– సామాజిక సేవకుడు డి.సతీశ్, సాయిని నరేందర్

ప్రభుత్వ ఉపాధ్యాయుడు వివాహేతర సంబంధం

- విషయం తెలిసి సదరు మహిళ భర్త బలవన్మరణం
- ఘటనలో ఉపాధ్యాయుడి అరెస్ట్

వాజేడు: మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమె భర్త మృతికి కారణమైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కటకటాల పాలయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలురుపాడు మండలం సూర్యాతండాకు చెందిన వాంకుడోత్ బావుసింగ్ ములుగు జిల్లా వాజేడు మండలం బిజినేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో జూలురుపాడుకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడి అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం సదరు మహిళ భర్తకు తెలియడంతో అతను సూసైడ్ నోట్ రాసి సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సూసైడ్ నోట్, సెల్ఫీ వీడియో ఆధారంగా కేసు నమోదు చేసిన కొత్తగూడెం పోలీసులు సదరు ఉపాధ్యాయుడిని ఈనెల 11వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంఈఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా బావుసింగ్‌ను అరెస్ట్ చేసిన మాట వాస్తమే కాని తనకు, జిల్లా విద్యాశాఖకు ఎలాంటి సమాచారం లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా సమీపంలోని మొరుమూరు పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుడిని బిజినేపల్లి పాఠశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు.

యూరియా వచ్చేసింది..

- వ్యాగన్‌లో రైల్వే గూడ్స్ షెడ్‌కు చేరిన యూరియా
- మార్క్‌ఫెడ్, ఫర్టిలైజర్ షాపులకు సరఫరా



గూడ్స్‌షెడ్ నుంచి లారీలో తరలిస్తున్న యూరియా

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్‌లోని గూడ్స్ షెడ్‌కు సోమవారం యూరియా చేరింది. దీంతో యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఊరట లభించింది. ఉమ్మడి జిల్లాలోని రైతులకు అందించేందుకు 1500.750 మెట్రిక్ టన్నుల క్రిబ్‌కో కంపెనీకి చెందిన యూరియా వచ్చింది. ఈ యూరియాను మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, ఇతర ఫర్టిలైజర్ షాపులకు 40 శాతం కేటాయించారు. సోమవారం ఉదయం నుంచే వరంగల్ గూడ్స్ షెడ్ నుంచి ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్, ఫర్టిలైజర్ షాపులకు తరలించే ప్రక్రి య ప్రారంభించామని వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు.

కొండపల్లిలో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేత

- అక్టోబర్ నుంచి అమల్లోకి..



కాజీపేట రూరల్ : ఫుట్ ఓవర్ బ్రిడ్జి మరమ్మతు కారణంగా కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అక్టోబర్ నుంచి కాజీపేట-విజయవాడ మధ్య గల కొండపల్లి రైల్వే స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు.

తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేసిన రైళ్లు ఇవే..

అక్టోబర్ 19 నుంచి నవంబర్ 11వ తేదీ వరకు మచిలీపట్నం-బీదర్ (12749) డైలీ ఎక్స్‌ప్రెస్, బీదర్-మచిలీపట్నం (12750) డైలీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ (17201) డైలీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (17202) డైలీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 18 నుంచి నవంబర్ 17వ తేదీ వరకు తిరుపతి-ఆదిలాబాద్ (17405) డైలీ కృష్ణాఎక్స్‌ప్రెస్, ఆదిలాబాద్-తిరుపతి (17406) కృష్ణాఎక్స్‌ప్రెస్, అదేవిధంగా అక్టోబర్ 19 నుంచి నవంబర్ 18వ తేదీ వరకు విజయవాడ-భద్రాచలం(67215) ప్యాసింజర్, భద్రాచలం-విజయవాడ (67216) ప్యాసింజర్, విజయవాడ-డోర్నకల్ (67768) ప్యాసింజర్లకు కొండపల్లిలో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేసినట్లు సీపీఆర్వో ఎ. శ్రీధర్ తెలిపారు.